క్లుప్తంగా

ఆర్థిక శాస్త్రంలో డాక్టరేట్



ఈశ్వరరెడ్డి

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం ఆర్థిక శాస్త్ర శాఖ పరిశోధకులు జి.ఈశ్వరరెడ్డికి విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆర్థిక శాస్త్ర శాఖ సహ ఆచార్యులు డా. సుదర్శన్‌రెడ్డి పర్యవేక్షణలో 'అగ్రికల్చర్ ట్రాన్స్ ఫర్మేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ఏ కేస్ ఆఫ్ రాయలసీమ రీజియన్' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కె.ఎస్.వి.కృష్ణారావు ప్రకటించారు.

పార్కు అందుబాటులోకి తీసుకురావాలి



జర్నలిస్టుకాలనీ పార్కును పరిశీలిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: కడప నగరం రిమ్స్‌కు సమీపంలో ఉన్న జర్నలిస్టు కాలనీ పార్కును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం జర్నలిస్టుకాలనీ పార్కు, అన్నమయ్య సర్కిల్ ప్రాంతాలను ఆయన పరిశీలించారు. జర్నలిస్ట్ కాలనీ పార్క్‌లో జరిగిన పనుల నాణ్యతను పరిశీలించారు. పార్క్‌లో గ్రీనరీ సమకూర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ మునిరత్నం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ధనలక్ష్మి, డిప్యూ టీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లు మల్లేశ్వర్, వేణుగోపాల్ నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ (డీబీటీ) స్టార్ కళాశాల హోదాలో నేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ తెలిపారు. బుధవారం కళాశాలలో 'సైన్స్ అండ్ టెక్నాలజీ కోసం అధునాతన మెటీరియల్స్ సంశ్లేషణ' అన్న అంశంపై నిర్వహించనున్న నేషనల్ కాన్ఫరెన్స్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020లో భాగంగా సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేషనల్ కాన్ఫరెన్స్ కన్వీనర్ డాక్టర్ బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ నవంబర్ 25వ తేదీన కళాశాలలో నిర్వహించే ఈ సదస్సుకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఆచార్యులు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు హాజరవుతారని తెలిపారు.

సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు

కడప అగ్రికల్చర్: పంటలసాగులో సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులను సాధించవచ్చని కడప మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం కడప మండల పరిధిలోని పాలంపల్లె, పాత కడప గ్రామాల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వరి పంటను పరిశీలించి రైతులకు తగిన సూచనలు, సలహాలను ఇచ్చారు. ప్రస్తుతం వరిలో దోమపోటు వచ్చే ఆస్కారం ఉందని దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.5 ఎంఎల్ లీటర్ నీటికి లేదా ఎసిఫేట్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి ఎకరాలకు 200 లీటర్లను పిచికారి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు పావని, మెహరాజ్, రైతులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిత్రాలు



విద్యార్థులు ముగ్గుల రూపంలో వేస్తున్న చిత్రాలు

కడప అగ్రికల్చర్: ఆచార్య ఎన్‌జీ రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని మహానంది వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు బుధవారం గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా తాటిగొట్ల గ్రామంలో ట్రెనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు గ్రామంలో రైతులతో మమేకమై పలు వ్యవసాయ పద్ధతులపై చర్చించారు. అలాగే వ్యవసాయ పంటలకు సంబంధించిన చిత్రాలను ముగ్గుల రూపంలో వేసి అందరినీ అలరించారు. గ్రామంలో ఏ పంట ఏ మేరకు సాగయిందనే విషయాలను కూడా చిత్రాల రూపంలో రైతులకు తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వైష్ణవి, ప్రణతి, విద్య, పార్థిభ, శ్రీవల్లి, షెరియా తదితరులు పాల్గొన్నారు.

తీర్మానాలు సరే...అమలేది?

- జనరల్ బాడీ, స్టాండింగ్ కమిటీ నిర్ణయాలకు దక్కని గౌరవం
- కార్పొరేటర్లు ఎంత గొంతు చించుకున్నా... షరా మామూలే
- నేటి సమావేశంలోనైనా స్పష్టత వచ్చేనా..!



కడప కార్పొరేషన్ కార్యాలయం

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థలో ప్రజలతో ఎన్నికైన ప్రజా ప్రతినిధులు (కార్పొరేటర్లు) సర్వసభ్య సమావేశాలు, స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. వారు చేసే తీర్మానాలకు నగరపాలక అధికారులు ఏమాత్రం గౌరవం, విలువ ఇవ్వడం లేదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలను గమనిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది.

- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన తొలి సర్వ సభ్య సమావేశంలో ఏడీపీ సర్వే పేరిట ప్రజలపై మోపిన పన్ను భారాలను ఉపసంహరించాలని, రాష్ట్రంలో ఎక్కడా లేని సర్వే ఇక్కడే ఎందుకు... దీన్ని వెంటనే నిలుపుదల చేయాలని కార్పొరేటర్లు చేసిన తీర్మానం అమలుకు నోచుకోలేదు.
- గత కమిషనర్ ఉన్నప్పుడు వార్డు సచివాలయ సెక్రటరీలకు ఆర్‌ఐలు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లుగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. 101వ సచివాలయాన్ని కంట్రోల్ రూముగా మార్చి అందులో కొంతమంది సెక్రటరీలను నియమించి వారి ద్వారా 100 సచివాలయాల్లోని సెక్రటరీలను పర్యవేక్షిస్తున్నారు. మిగతా సెక్రటరీలపై... ఈ ఇన్‌చార్జులు, కంట్రోల్ రూములోని సెక్రటరీల పెత్తనం ఎక్కువైందనే ఆరోపణలు ఉన్నాయి. కంట్రోల్ రూమ్‌లోని సిబ్బంది పెత్తనం జీర్ణించుకోలేక గతంలో ఒక అడిషనల్ కమిషనర్ బదిలీ చేయించుకొని వెళ్లిపోయినట్లు విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా సచివాలయ సెక్రటరీలను యథాస్థానాలకు పంపాలని గత స్టాండింగ్ కమిటీ సమావేశంలో తీర్మాణించినా అది అమలు జరగలేదు.
- అలాగే గతంలో 20 మంది వలంటీర్లను టాస్క్ ఫోర్స్ టీంగా ఏర్పాటు చేసి వారికి రూ.12 వేల జీతం చొప్పున ఇస్తున్నారు. ఏవైనా విపత్తులు సంభవించినప్పుడు, ప్లాస్టిక్ నిషేధం అమలు వంటి వాటికి ఉపయోగిస్తున్నామని చెప్తున్నారు. వాస్తవానికి గతంలో పనిచేసిన కమిషనర్‌కు వీరు రక్షణ కవచంలా పనిచేయడంతోపాటు పన్నులు, ట్రేడ్ లైసెన్సులు, జరిమానాలు వసూలు చేసేందుకు ప్రైవేటు సైన్యంలా పనిచేశారు. ఈ టీంను రద్దు చేయాలని స్టాండింగ్ కమిటీ చేసిన తీర్మాణం కూడా అమలుకు నోచుకోలేదు.

క్లాప్ ప్రోగ్రాంపై కానరాని స్పష్టత

స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా నిర్వహిస్తున్న క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) కార్యక్రమంపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ కార్యక్రమంలో ఇంటింటి నుంచి చెత్త సేకరణ చేస్తూ ఒక్కో ఇంటి నుంచి రూ.90లు, మురికివాడల్లో రూ.40లు యూజర్ చార్జీలు వసూలు చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చెత్త పన్ను రద్దు చేస్తామని చెప్పారు. అయితే ఈ క్లాప్ ఆటోలను ఉంచాలా... తీసేయాలా...చెత్త సేకరణ ఎలా చేయాలన్నదానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో సందిగ్ధత కొనసాగుతోంది. నగరంలో చాలా చోట్ల ఇంటింటి చెత్త సేకరణ జరగలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

ప్రొటోకాల్ ఉల్లంఘన

కడప మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతి కార్యక్రమానికి మేయర్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులకు ఆహ్వానాలు పంపడం ఆనవాయితీ. ఇది ప్రొటోకాల్ కూడా. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తరచూ ప్రొటోకాల్ ఉల్లంఘనలు చోటు చేసుకుంటున్నాయన్న విమర్శలున్నాయి. ప్రభుత్వం నిర్వహించే అధికారిక కార్యక్రమాలకు అధికార, ప్రతిపక్షమనే తేడా లేకుండా అందరినీ భాగస్వాములను చేయాల్సిన అవసరముంది.

నేడు నగరపాలక సర్వసభ్య సమావేశం

కడప నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ మనోజ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫిషియో సభ్యులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

పరిశుభ్రత, పచ్చదనం మాటున అవినీతి

కడప నగరపాలక సంస్థ పరిధిలో పరిశుభ్రత, పచ్చదనాన్ని పెంపొందించాలన్న సంకల్పంతో వివిధ ప్రాంతాల నుంచి తెచ్చిన మొక్కల కొనుగోళ్లలో పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్లు ఆరోపణలున్నాయి. అధిక ధరలకు మొక్కలు తెచ్చి వాటిని నాటడానికి, పరిరక్షించడానికి అదనపు వర్కర్లను వినియోగించి వారికి కూలీ చెల్లించినట్లు లెక్కలు చూపి బొక్కేశారన్న విమర్శలున్నాయి.

అభివృద్ధి పనుల ఊసేలేదు

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు మాసాలు కావొస్తోంది. కడప నగరపాలక సంస్థ పరిధిలో ఇంతవరకూ ఒక్క అభివృద్ధి పథకం కూడా మంజూరు కాలేదు. గత ప్రభుత్వంలో పూర్తయిన వాటికి ప్రారంభోత్సవాలు, మంజూరైన పనులకు శంకుస్థాపనలు మాత్రమే చేస్తున్నారు....ఆ పనులనే కొనసాగిస్తున్నారు. ఎర్రముక్కపల్లె రైల్వే అండర్‌బ్రిడ్జి కూడా గత ప్రభుత్వంలో మంజూరైందే. అదే సమయంలో మంజూరైన బుగ్గవంకపై గుర్రాలగడ్డ వద్ద, నాగరాజుపేట వద్ద బ్రిడ్జిల నిర్మాణం ఇంకా మొదలే కాలేదు. ఇవిగాక కడపలో కొత్తగా ఈ పనులు చేపట్టాలన్న ప్రతిపాదనలుగానీ, ప్రణాళికలుగానీ అధికారులు రూపొందించలేదు. దీన్ని బట్టి కడప నగరాభివృద్ధిపై కూటమి ప్రభుత్వానికి ఒక నిర్దిష్ట ప్రణాళిక లేదని అర్థమవుతోంది.

రచ్చచేసేందుకు టీడీపీ సన్నాహాలు!

కార్పొరేషన్ కౌన్సిల్ మీట్‌లో రచ్చ చేయాలనే ఎత్తుగడలను టీడీపీ ఎంచుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. అదే విషయాన్ని ఇప్పటికే కార్పొరేటర్లు స్వయంగా జిల్లా ఎస్పీని కలిసి విన్నవించారు. పాలక మండలికి మేయర్ సుప్రీం. ఇది జగమెరిగిన సత్యం. కాగా ఎమ్మెల్యేలు కేవలం కౌన్సిల్‌కు ఎక్స్‌అఫిషియో మెంబర్లు మాత్రమే. సలహాలు, సూచనలు చేయడం వారి విధి. అలాంటి స్థానంలో ఉన్న ఎక్స్‌అఫిషియో మెంబర్లకు కూడా గౌరవం కల్పిస్తూ కడప మేయర్ కె సురేష్ బాబు ఇదివరకూ నిర్ణయం తీసుకున్నారు. మునపటి పాలకమండలిలో కూడా ఆయనే మేయర్‌గా కొనసాగడంతో సమాన గౌరవం ఇస్తూ మేయర్ సీటు చెంతలో ఎక్స్‌అఫిషియో మెంబర్లుగా ఉన్న ఎమ్మెల్యేలకు సీటు కేటాయించారు. ఇది కేవలం మేయర్ విచక్షణాధికారంతో కొనసాగించడం మినహా ఎలాంటి ప్రొటోకాల్ లేదు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కడపలో వింత పోకడలు తెరపైకి వచ్చాయి. ఏకంగా టీడీపీ శ్రేణులు మేయర్ ఇంటిపై చెత్త వేయించిన దురదృష్టకర ఘటన తెరపైకి వచ్చింది. ఈపరిస్థితుల్లో తన హోదా మేరకు మేయర్ చైర్ మాత్రమే ఉండేలా చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేలకు సైతం కార్పొరేటర్లు కూర్చునే స్థానంలోనే సీటు కేటాయించే పరిస్థితి ఉత్పన్నమైనట్లు విశ్వసనీయ సమాచారం.రాష్ట్రంలో విశాఖపట్నం నుంచి అనంతపురం వరకూ కూడా మేయర్ సీటు ఒక్కటే కొలువై ఉంది. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సీట్లు కార్పొరేటర్లకు కేటాయించిన సీట్ల చెంతలోనే ఉన్నాయి. కర్నూల్‌లో ఇటీవల మంత్రి టీజీ భరత్ సైతం కార్పొరేటర్లకు కేటాయించిన స్థానంలో ఆశీనులు కావడం విశేషం.



కర్నూల్‌లో మేయర్ రామయ్య సీటు (ఫైల్)



కార్పొరేటర్ల స్థానంలో కూర్చున్న మంత్రి, ఎమ్మెల్యేలు (ఫైల్)

వైవీయూ లా ఆఫీసర్‌గా రెడ్డయ్య



లా ఆఫీసర్‌గా నియామక పత్రాన్ని అందజేస్తున్న వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ తదితరులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం లా ఆఫీసర్ (పార్ట్‌టైం బేసిస్) గా కడప నగరానికి చెందిన అడ్వకేట్ డి. రెడ్డయ్యను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం విశ్వవిద్యాలయంలో వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి నియామక ఉత్తర్వులను ఆయనకు అందజేశారు. విశ్వవిద్యాలయానికి సంబంధించిన న్యాయసమస్యలపై సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించాలని వీసీ సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, ఆచార్య జయరామిరెడ్డి పాల్గొన్నారు.

మార్కుల నమోదు పూర్తి చేయాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా గతంలో జరిగిన సెల్ఫ్ అసెస్మెంట్-1కు సంబంధించిన మార్కులను గురువారం సాయంత్రంలోగా కడప మండల పరిధిలోని అన్ని యాజమాన్యాలు యాప్‌లో నమోదు చేయాలని కడప మండల విద్యాశాఖ అధికారి దిద్దకుంట గంగిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కుల నమోదులో ఉపాధ్యాయులతోపాటు ప్రధానోపాధ్యాయులు సహకరించి వెంటనే మార్కుల నమోదు పూర్తి చేయాలన్నారు. అలాగే అపార్ నమోదు 50మంది లోపు విద్యార్థులున్న పాఠశాలలు కూడా గురువారం సాయంత్రంలోపు పూర్తి చేయాలన్నారు. నమోదులో ఏవైనా సమస్యలుంటే వెంటనే మండల వనరుల కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

11లోపు వ్యాసాలు రాసి పంపాలి

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన విశ్వాత్మ పిరమిడ్ యోగా కేంద్రం ఆధ్వర్యంలో నెహ్రూ జయంతి (బాలల దినోత్సవం)ని పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించనున్నట్లు ప్రొఫెసర్ జీవీ శేషారెడ్డి తెలిపారు. 6 నుంచి 14 సంవత్సరాల వయస్సుగల విద్యార్థులు నేటి బాలలే రేపటి పౌరులు అనే అంశంపై తెలుగు లేదా ఇంగ్లీషులో వ్యాసం రాసి పంపాలని సూచించారు. ఇది నాలుగు పేజీలకు మించకూడదని, నవంబరు 11వ తేదీలోపు పంపాలని సూచించారు. పోటీ కోసం రాసిన వ్యాసాలను జీవీఎస్ రెడ్డి, విశ్వాత్మ పిరమిడ్ యోగా సెంటర్, 125డి, గౌతమ్‌బుద్ధ టౌన్‌షిప్, ప్రకాశ్‌నగర్, శివానందపురం రోడ్డు, కడప అనే చిరునామాకు పంపాలన్నారు. వివరాలకు 80748 26819 సంప్రదించాలన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు కృషి

కడప సెవెన్‌రోడ్స్ : మహాదాత బుడ్డా వెంగళరెడ్డి, ప్రథమ స్వాతంత్య్ర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కాంస్య విగ్రహాలను కడప నగరంలో ఏర్పాటు చేయించే బాధ్యత తీసుకుంటామని శాసనసభ్యులు ఆర్.మాధవీరెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి ఎన్.రవిశంకర్‌రెడ్డి, పాతకడప మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, ఏపీ రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షులు లింగందిన్నె విజయభాస్కర్‌రెడ్డి తదితరులు ఎమ్మెల్యే మాధవీ, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులురెడ్డిని కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు.

భూ ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలి

కడప రూరల్: భూ ఆక్రమణకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకొని, తన ప్రాణాలకు రక్షణ కల్పించాలని పెండ్లిమర్రి మండలం నందిమండలం గ్రామానికి చెందిన చిన్న కొండారెడ్డి తెలిపారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ గ్రామంలో తనకు వారసత్వంగా తండ్రి నుంచి సంక్రమించిన 2.64 ఎకరాలు ఉందన్నారు. ఈ భూమిని ఆక్రమించుకోవడానికి ముగ్గురు వ్యక్తులు ప్రయత్నించడమే గాక తనపై బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ విషయమై స్థానిక తహశీల్దార్‌తో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

పదోన్నతుల కల్పనకు చర్యలు తీసుకోవాలి

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పదోన్నతుల కల్పనకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బీ శ్రీనివాసులు కోరారు. ఇటీవల వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం రీజనల్ డైరెక్టర్‌గా నియమితులైన డాక్టర్ రామగిడ్డయ్యను బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నర్సింగ్ సూపరింటెండెంట్, ఫార్మాసిస్ట్‌తో పాటు ఇతర కేడర్‌లకు సంబంధించి పదోన్నతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆ అసోసియేషన్ కర్నూలు జిల్లా అధ్యక్షులు సీహెచ్ వెంగల్‌రెడ్డి, జిల్లా నాయకులు బాల పుల్లయ్య, నిత్యపూజయ్య పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం



వైవీయూలో రక్తదాన శిబిరంలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు



రక్తదానం చేస్తున్న చైతన్య విద్యాసంస్థల ఏజీఎం రమణయ్య

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం, ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. బుధవారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని డీఓఏ కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి. పద్మ ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎన్. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన రక్తదాన శిబిరంలో వందమంది రక్తదానం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైవీయూ ఆరోగ్య కేంద్రం డాక్టర్ నరేష్, రెడ్ క్రాస్ సంస్థ వైద్యాధికారి డా.యశస్విరెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓలు డా కె. శ్రీనివాసరావు, డా. ఎస్పీ వెంకటరమణ, డా. కె. లలిత, డా. సునీత డా. శ్రీధర్ రెడ్డి, డా. గంగయ్య, ఆచార్య విజయభారతి, ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ స్పెషలాఫీసర్ శివశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

చైతన్య పాఠశాలలో...

కడప ఎడ్యుకేషన్: మనం చేసే రక్తదానం అత్యవసర పరిస్థితుల్లో మరొకరికి ప్రాణదానం అవుతుందని శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం రమణయ్య పేర్కొన్నారు. శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్‌పర్సన్ డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి 76వ జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం కడప రింగ్‌రోడ్డు శ్రీచైతన్య స్కూల్లో కేకును కట్ చేసి వేడుకలను నిర్వహించారు. అనంతరం రిమ్స్ వైద్యులు చేత రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజీఎం రమణయ్యతోపాటు మరో 60 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశోధన ఫలితాలు ప్రజలకు లభించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్

వైవీయూ: పరిశోధకులు చేసే పరిశోధనా ఫలితాల ప్రయోజనాలు ప్రజలందరికీ చేరినప్పుడు వాటి ప్రయోజనం నెరవేరుతుందని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో జీవశాస్త్ర శాఖ ఆధ్వర్యంలో ఆధునిక జీవశాస్త్రంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జీవశాస్త్ర ఫలితాలు మనుషులు ఎదుర్కొంటున్న పలు జబ్బులకు పరిష్కారాలు చూపుతాయన్నారు. ఈ సదస్సుకు వివిధ ప్రాంతాల నుంచి వర్చువల్ విధానంలో పాల్గొనే వారందరికీ ఆయన అభినందనలు తెలిపారు. అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ డాక్టర్ తులసి మాట్లాడుతూ ఆధునిక జీవశాస్త్ర పరిశోధనల వల్ల మానవుల్లో వచ్చే వ్యాధులను త్వరగా నయం చేయడానికి వీలవుతుందన్నారు. ముఖ్య వక్త ప్రొఫెసర్ సత్యవేలు రెడ్డి మాట్లాడుతూ మధుమేహం తగ్గించడానికి ఆక్వాలీఫా ఇండికా మొక్కతో చేసిన ప్రయోగాలలో మధుమేహం వ్యాధిని నియంత్రించడంలో సమర్థవంతమైన ఫలితాలు వచ్చాయని వివరించారు. మలేషియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ నోరిజా మాట్లాడుతూ అల్ట్రా సోనికేషన్ పద్ధతిలో హైడ్రాలిస్ చేసిన శనగ ప్రోటీన్ గురించి వివరించారు. డాక్టర్ ఎం. భరణిధరన్, డా. ఇస్మాయిల్, సదస్సు కన్వీనర్ డా. వీరనాగేంద్రకుమార్‌లు సదస్సులో ఉపన్యసించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. రమేష్, అధ్యాపకులు డా. పి. రవిశేఖర్, డా. నీలయ్య, డా. వై. సావిత్రి, డా. మహేష్, డా. నాగేశ్వరరెడ్డి, జమాల్‌బాషా, రామచంద్ర, అపర్ణ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట బైఠాయింపు



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

కడప సెవెన్‌రోడ్స్ : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర పిలుపులో భాగంగా బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కోటిరెడ్డిసర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శనగా వెళ్లి అక్కడ బైఠాయించారు. ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్, వీరపోగు రవి మాట్లాడుతూ 2023- 24 సంవత్సరానికి సంబంధించి డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు 3,480 కోట్ల రూపాయల ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, జీఓ నెంబరు 77 రద్దుచేసి పీజీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఉన్న వసతి గృహాలలో ఎన్నో సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి అజయ్, జిల్లా కమిటీ సభ్యులు అభినయ్, పట్టణ మండల నాయకులు, సురేష్, జెర్మియా, చక్రవర్తి ,గిరి, జయంత్, ఈశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులను తీసుకోవాలన్న నిర్ణయం తగదు



కడప రైల్వే డిప్యూటీ స్టేషన్ మేనేజర్‌కు వినతి పత్రాన్ని సమర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్ర ప్రభుత్వం రైల్వేలో పనిచేస్తూ రిటైర్డ్ అయిన ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతిన తిరిగి తీసుకోవాలన్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం కడప రైల్వే డిప్యూటీ స్టేషన్ మేనేజర్‌కు వారు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో ప్రపంచంలో ఎక్కడా లేనంత యువశక్తి ఉన్నప్పటికీ వారికి ఉపాధి కల్పనలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో కడప నగర కన్వీనర్ విజయ్, జిల్లా సహాయ కార్యదర్శి అంజి, నగర నాయకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్, బ్యూటీ పార్లర్, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లలో 30 రోజులపాటు, జ్యూట్ బ్యాగుల తయారీలో 13 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నామని కెనరా బ్యాంకు ఆర్‌సెటీ డైరెక్టర్ ఎం.ఆరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. 18-45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ మహిళలు శిక్షణకు అర్హులన్నారు. వివరాలకు 94409 05478, 94409 33028 లో సంప్రదించాలన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని కొండాపురం రెసిడెన్సియల్ పాఠశాలలో పాముకాటుకు గురై చికిత్స పొందుతున్న విద్యార్థులను ఆదుకోవాలని రాయలసీమ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి మల్లేల జగదీష్ జిల్లా కలెక్టర్ చెరుకూరు శ్రీధర్‌ను కోరారు. ఇందుకు సంబంధించిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు సమర్పించి పలు సమస్యలను వివరించారు.

శిక్షణ పేరుతో ఉపాధ్యాయులను శిక్షించడం తగదు

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు వివిధ రకాల శిక్షణల పేరుతో బోధనకు దూరం చేస్తూ శిక్షించడం తగదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు తెలిపారు. బుధవారం కడప యూటీఎఫ్ భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫౌండేషనల్ లిట్రసి అండ్ న్యూమరసి పేరుతో ప్రాథమిక పాఠశాలల్లోని ఉపాధ్యాయులను, లీడర్షిప్ ట్రైనింగ్ పేరుతో ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను పాఠశాలల్లో విద్యాబోధనకు దూరం చేయడం తగదన్నారు. ప్రస్తుతం పాఠశాలల్లో విద్యార్థులకు అపార్ ఐడీలు సృష్టించమని ఒక వైపు ఒత్తిడి తీసుకు వేస్తూనే, ఆధార్ అప్డేషన్ చేయించమని, పదవ తరగతి విద్యార్థులకు నామినల్ రోల్స్ తయారు చేయమని, ఎఫ్ఏ 2 పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించమని చెప్పడంతోపాటు నవంబర్ 14వ తేదీన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ జరపాలని సూచించారన్నారు. మరోవైపు రెసిడెన్షియల్ శిక్షణా తరగతుల పేరుతో అరాకొర వసతులు కలిగిన శిక్షణా కేంద్రాల్లో నిర్బంధించి తీవ్ర వేధింపులకు ఉపాధ్యాయులను గురి చేస్తున్నారన్నారు. ఈ వేధింపులు తాళలేక పశ్చిమగోదావరి జిల్లాలో ఒక ప్రధానోపాధ్యాయుడు శిక్షణా తరగతుల కేంద్రంలోనే తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనై ప్రాణాలు కోల్పోయారన్నారు. ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం ఇదే నిరంకుశ వైఖరి కొనసాగిస్తే భవిష్యత్తులో ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తామని తెలిపారు.

రెసిడెన్షియల్ శిక్షణ ఆపాలి..

- ఉపాధ్యాయులకు వారం రోజుల పాటు నిర్బంధ శిక్షణ నిర్వహించి శిక్షించవద్దని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సి. చెన్నయ్య, డి. కొండారెడ్డి ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
- రెసిడెన్షియల్ ట్రైనింగ్‌లను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంభం బాలగంగిరెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, ఏపీటీఎఫ్ అమరావతి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర, అలీఖాన్‌లతోపాటు పలు ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి.